# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ బారువా బీచ్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ ప్రభుత్వం సంకల్పించిన స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.
- ❖ రాష్ట్రంలో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.
- ❖ జీవీఎంసీ మేయర్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యుల మద్దతు లభించింది.

====================

శ్రీకాకుళం జిల్లాలోని బారువా బీచ్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈరోజు “బీచ్ ఫెస్టివల్” సందర్భంగా ఆలివ్ రిడ్లీ తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టే ప్రత్యేక కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బారువా బీచ్‌కు ఉన్న స్వచ్ఛమైన పరిసరాల రీత్యా మినీ గోవా తరహాలో అభివృద్ధి చేయవచ్చన్నారు. సముద్రపు లోతు, తీరప్రాంత సరళత, పర్యాటక క్రీడలకు అనువుగా ఉంటుందని తెలిపారు. తీరప్రాంత సౌందర్యం, మౌలిక సదుపాయాలపై నిపుణుల పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మత్స్యకారులకు తాబేళ్ల పరిరక్షణపై శిక్షణ ఇచ్చి, ప్రకృతి సమతుల్యతను కాపాడే విధంగా వారిని భాగస్వాముల్ని చేస్తున్నాం అని వివరిస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

====================

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యులు మద్దతు తెలిపారని విశాఖ జిల్లా కలెక్టర్, ప్రెసిడెంట్ అధికారి ఎం.ఎన్ హరేంధీర ప్రసాద్ తెలిపారు. ఈరోజు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర మేయర్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్

సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... అవిశ్వాస తీర్మానం సమావేశానికి జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు 63 మంది హాజరయ్యారని, ఎక్స్ అఫీషియో సభ్యులైన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు 11 మందితో కలిపి మొత్తం 74 మంది సభ్యులు హాజరయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో అవిశ్వాస తీర్మానానికి కోరం సరిపోవడంతో, ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టామని, 74 మంది సభ్యులు అవిశ్వాసనికి మద్దతు తెలిపారని చెప్పారు. ఈ అవిశ్వాస తీర్మానంపై వచ్చిన మద్దతును అంగీకరించి తీర్మానం ఆమోదించినట్లు కలెక్టర్ తెలిపారు. తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

====================

ప్రభుత్వం సంకల్పించిన స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఈరోజు రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పి. ప్రశాంతితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధించాలన్న లక్ష్యంలో భాగంగా స్వచ్ఛాంధ్రప్రదేశ్ వైపు అడుగులు వేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రతినెలా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తోందని, దీనిలో భాగంగా ఈరోజు ‘ఈ-చెక్’ థీమ్‌తో కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఈ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడంపై దృష్టి సారించాలని మంత్రి పిలుపునిస్తూ..

(వాయిస్ 35 సెకన్లు)

====================

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్ కార్డుదారులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించి 8 లక్షల 16 వేల 859 రేషన్ కార్డుదారులు ఉన్నారని, ఇప్పటి వరకు 7 లక్షల 49 వేల 481 మంది ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన 54 వేల 392 మంది రేషన్ కార్డుదారులు ఈనెల 30వ తేదీలోగా సమీపంలో గల డీలర్ వద్ద గాని, ఎం.డి.యు ఆపరేటర్ వద్ద గాని తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె సూచించారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు, 80 సంవత్సరాల పైబడిన వ్యక్తులకు ఈకేవైసీ అవసరం లేదన్నారు.

విరామం

====================

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తూ ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖలతో సహా యూనిఫార్మ్ సర్వీసులలో క్రీడాకారులకు పోటీ పరీక్షల అవసరం లేకుండా నేరుగా నియామక అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. మొత్తం 65 క్రీడా విభాగాలు ఈ ప్రత్యక్ష నియామకాల్లో భాగస్వామ్యమవుతున్నాయని అన్నారు. ఈ ప్రోత్సాహంతో క్రీడాకారులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. క్రీడాకారుల భవిష్యత్ ధ్యేయంగా, ప్రణాళికాబద్ధంగా క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

క్రీడా పాలసీలో పొందుపరిచిన స్పోర్ట్స్ కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జీఓ జారీ చేయడం శుభపరిణామమని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల తరుపున ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

====================

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈరోజు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ. భరత్ తో కలసి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ.... రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అందని చికిత్సను కర్నూలు క్యాన్సర్ ఆసుపత్రిలో అందిస్తామని, ప్రపంచంలో అత్యదిక ఆదునాతనమైన వైద్య పరికరాలను సుమారు 22 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. అత్యంత క్లిష్టమైన సర్జరీలు సైతం పేద ప్రజలకు ఉచితంగా అంద చేస్తున్నామని సత్యకుమార్ యాదవ్ తెలుపుతూ..

(వాయిస్ 33 సెకన్లు)

====================

ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చూట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో కోటి ఇరవై లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టణాల అభివృద్ధికి బడ్జెట్లో 13 వేల 862 కోట్ల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఐటీ హబ్ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

====================

రైతులు ఆధునిక వ్యవసాయం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక దిగుబడులు, రాబడిని సాధించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పార్వతీపురంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో జరిగిన మండల వ్యవసాయ పరిశోధనా, విస్తరణ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 51 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, 70 శాతం జనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు.

====================
====================